క్లుప్తంగా

దాడిశెట్టి రాజాను కలసిన అమ్మాజీ



తునిలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అమ్మాజీ

తుని: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాను ఆ పార్టీ అధికార ప్రతినిధి పెదపాటి అమ్మాజీ సోమవారం తునిలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనను పార్టీ అధికార ప్రతినిధిగా నియమించేందుకు సహకరించిన దాడిశెట్టి రాజాకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులపై చర్చించారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అమ్మాజీ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ధర్మవరంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు సోమవారం పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన నూలు భావనరెషు (బుజ్జి) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనను మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేలు అందజేశారు. కార్యక్రమంలో నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, రాయుడు దొరబాబు, గుద్దటి రమేష్, గిడుతూరి రాంబాబు, నూలు రమణ, నూలు నూకరాజు, కేశవరపు శ్రీను తదితరుల పాల్గొన్నారు.

సోమరాజు కుటుంబానికి పరామర్శ



అన్నవరంలో సోమరాజు కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న యనమల కృష్ణుడు తదితరులు

అన్నవరం: విద్యుత్ షాక్‌తో ఇటీవల మృతి చెందిన స్థానిక ఎలక్ట్రీషియన్ బర్ల సోమరాజు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్న, గోపాలపట్నం మాజీ సర్పంచ్ కటకం ఈశ్వరరావు, కొండపల్లి అప్పారావు తదితరులు ఉన్నారు.

సత్యదేవుని దర్శించిన జస్టిస్ సీతారామ్మూర్తి



సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న జడ్జి సీతారామ్మూర్తి

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సీతారామ్మూర్తి సోమవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా సత్యదేవుని ఫొటో, ప్రసాదాలను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

అరుణాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామి అఖండ జ్యోతిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపిత కుచాంబా సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానానికి సోమవారం భక్తులు పోటెత్తారు. పండితులు స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



కొత్త సూరవరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఏలేశ్వరంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



రౌతులపూడిలో అమ్మవారి ఆలయం వద్ద బోనాలతో భక్తులు



గోకవరం వీరభద్రునిగద్దెలో బాలత్రిపురసుందరీదేవిగా అమ్మవారు

దసరా వచ్చిందయ్యా!

- వైభవంగా దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం
- తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ప్రత్తిపాడులో కలశాలతో ప్రదర్శన

ఏలేశ్వరం: దసరా ఉత్సవాలు నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లోని ఆలయాలు, మండపాల వద్ద దుర్గమ్మ విగ్రహాలను నెలకొల్పారు. స్థానిక తోటవీధిలో అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు ప్రారంభించారు. పట్టణంలోని లింగవరం కాలనీ, దిబ్బలపాలెం సంతోషి మాత గుడి వద్ద దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఉదయం నుంచి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. లింగంపర్తిలోని సత్రంపంపుకాలనీ, సుబ్బారావుకాలనీ తదితర ప్రాంతాల్లోనూ అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి వేడుకలను ప్రారంభించారు.

తుని రూరల్: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లోవ దేవస్థానంలోని తలుపులమ్మతల్లి బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు, వేద విద్యార్థులు రాజరాజేశ్వరి అమ్మవారికి విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త సూరవరంలో వేంచేసిన అమ్మవారిని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, నాయకులు వేముల శివనారాయణ, వంగలపూడి కాంతారావు, కీర్తి రాఘవ, వంగలపూడి గోవిందుబాబు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. డి.పోలవరం, వి.కొత్తూరు, ఎస్.అన్నవరం, తేటగుంట, టి.తిమ్మాపురం, హంసవరం, రేఖవానిపాలెం, కేఓ మల్లవరం, రాపాక, దొండవాక, ఎస్.సూరవరం తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలు నెలకొల్పి దసరా ఉత్సవాలను ప్రారంభించారు.

ప్రత్తిపాడు: దసరాను పురస్కరించుకుని స్థానిక మునసబు గారి రామాలయం వద్ద, పంచాయతీ కార్యాలయం సమీపంలో కనకదుర్గమ్మ విగ్రహాలను నెలకొల్పారు. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక తోటవీధి, జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద అభయ దుర్గాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పెదశంకర్లపూడి, టి.రాయవరం, చినశంకర్లపూడి, ఏలూరు గ్రామాల్లోని దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి దశమి వేడుకలను ఘనంగా ప్రారంభించారు.

కలశాలతో అమ్మవారి ఊరేగింపు

ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. 108 మంది మహిళలు, భవానీ భక్తులు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని మెయిన్‌రోడ్డు, పల్లపు వీధి, మునసుబు గారి రామాలయం వీధి, తోట వీధి తదితర ప్రధాన వీధుల గుండా ఊరేగించి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.

రౌతులపూడి: మండలంలో దసరా ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సినిమా సెంటర్‌లో వేంచేసిన కనకదుర్గ అమ్మవారు తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు వసంత జలాలతో కూడిన కడవలను నెత్తిన ఎత్తుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని ఎస్.పైడిపాల, ఉప్పంపాలెం, గిడజాం, ఎస్.అగ్రహారం, పారుపాక, గంగవరం, రాజవరం, ములగపూడి, బలరామపురం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్ ఎస్ పట్నం, ఎ.మల్లవరం తదితర గ్రామాల్లోనూ శరన్నవరాత్ర ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు.

శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం

కిర్లంపూడి: మండలంలో శరన్నవరాత్ర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జగపతినగరంలోని అభయ దుర్గమ్మ, కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, చిల్లంగి, రామచంద్రపురం, తామరాడ, వీరవరం, బూరుగుపూడి, సోమరాయణంపేట, సింహాద్రిపురం గ్రామాల్లో వేంచేసిన దుర్గాదేవి అమ్మవారు తొలిరోజు బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో తొలిరోజు శనివారం దుర్గాదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో అపిత కుచాంబ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని శరభవరం, గజ్జనపూడి, ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, పెద్దిపాలెం, ఉత్తరకంచి, పోతులూరు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

తుని: పట్టణంలో దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక రామా థియేటర్, రాజీవ్ గృహకల్ప, ఉప్పరగూడెం ప్రాంతాల్లోని కనకదుర్గమ్మను మున్సిపల్ చైర్మన్ నార్ల భువనసుందరి దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, శంఖవరం, జి.కొత్తపల్లి, నెల్లిపూడి తదితర గ్రామాల్లో కనకదుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి దసరా ఉత్సవాలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. భజన బృందాలు భజనలు చేశాయి. శంఖవరం, జి.కొత్తపల్లి గ్రామాల్లో కనకదుర్గమ్మను ఎంపీపీ పర్వత రాజబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారికి ముద్రగడ ప్రత్యేక పూజలు

కిర్లంపూడి: గ్రామంలోని పలు ప్రాంతాల్లో దుర్గమ్మ ఆలయాలను సోమవారం వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కుటుంబ సమేతంగా దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం సతీమణి పద్మావతి జగపతినగరంలోని అభయ దుర్గమ్మ, కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, చింతల తోటలోని కనక దుర్గమ్మ అమ్మవార్లకు చీర, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్, వీరభద్రునిగద్దెలో శరన్నవరాత్ర ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవీచౌక్ ఆలయంలో ఉదయం కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారి వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలను భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు భారీ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు. తొలిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథ శర్మ, వల్లూరి శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్థానిక వీరభద్రునిగద్దెలోనూ అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు గాయత్రీదేవి అలంకారం

శరన్నవరాత్ర ఉత్సవాల్లో రెండో రోజు గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ, వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మలు శ్రీగాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తొండంగి: స్థానిక రామలింగేశ్వరాలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావికంపాడులోని మహిషాసురమర్దిని ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గోపాలపట్నం నేరేళ్లమ్మ, రైల్వేస్టేషన్ రోడ్డు, ఒంటిమామిడి, ఎ.కొత్తపల్లి, వేమవరం, పెరుమాళ్లపురం, శృంగవృక్షం తదితర గ్రామాల్లో దుర్గామాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



జగపతినగరంలో అభయ దుర్గమ్మను దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు

వేడుకగా దసరా ఉత్సవాలు

గండేపల్లి/జగ్గంపేట: దసరా ఉత్సవాలు గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లోని ప్రధాన కూడలి ప్రదేశాలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలను ప్రారంభించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

శోభాయమానంగా కలశయాత్ర

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లిలో కనకదుర్గమ్మ కలశయాత్ర సోమవారం శోభాయమానంగా జరిగింది. స్థానిక, పరిసర గ్రామాల నుంచి వందలాదిగా తరలివచ్చిన మహిళలు కలశాలను సిరస్సున ధరించి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఏటా కలశయాత్రతో శరన్నవరాత్ర ఉత్సవాలను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కలశయాత్ర చేసిన మహిళలకు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. తొలిరోజు అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించిన వేదపండితులు పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించారు.



కాకరాపల్లిలో కలశయాత్ర చేస్తున్న మహిళలు

సీలింగ్ భూమిని పేదలకు పంచాలి

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేటలో సీలింగ్ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా పంచాలని కోరుతూ సోమవారం ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేసి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుదని, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇళ్లస్థలాలు ఇచ్చింది లేదని విమర్శించారు. సర్వే నంబర్ 204లో సుమారు 12 ఎకరాల భూమి నిరూపయోగంగా ఉందన్నారు. ఈ భూమి కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజబాబు, రామలింగేశ్వరరావు, అంజిబాబు, సతీష్, సంగీత, దుర్గాదేవి, తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘ సభ్యులు

రక్తదాన శిబిరం

గోకవరం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరం ప్రభుత్వాస్పత్రిలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ ఎల్.రామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో బీజేపీ నాయకులు, అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, అల్లాడి అరుణకుమారి, పిట్ట అరుణ్, బీజేపీ సీనియర్ నాయకులు మట్టా మంగరాజు, సత్తి వెంకటరెడ్డి, కోన వెంకట సురేష్, మండల అధ్యక్షుడు ఇనకోటి బాపన్న దొర, ఉంగరాల ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఏఓగా లక్ష్మి బాధ్యతల స్వీకరణ

గండేపల్లి: మండల వ్యవసాయాధికారిగా జె.లక్ష్మి బాధ్యతలు చేపట్టారు. కాకినాడ ఏడీ ఆఫీస్‌లో టెక్నికల్ ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. సోమవారం ఆమె ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి

కిర్లంపూడి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచి, ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర అధికారులను కోరారు. మండలంలోని సోమవరం గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామస్తులు పారిశుధ్యం, మంచినీటి ఎద్దటి, పింఛన్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సూర్యచంద్ర హామీ ఇచ్చారు.

గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

ప్రత్తిపాడు: మండలంలోని పాదురుపాక గ్రామ గిరిజనులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అనుబంధ సంస్థ ఆదివాసీ గిరిజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రత్తిపాడులో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. లిబరేషన్ శ్రేణులు పోరాటాలు చేసి సాధించిన భూమిని గిరిజనులకు పంపిణీ చేశారన్నారు. ఈ భూమినే నమ్ముకుని, సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని గిరిజనులు చెప్పారు. ఈ భూములు సాగుచేస్తున్న తమపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లిబరేషన్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు మానుకొండ లచ్చబాబు, ఇరటా కృష్ణ, అడ్డాల వెంకట్రావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాకో విజిలెన్స్ వీక్ వేడుకలు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం నేషనల్ ఫార్మాకో విజిలెన్స్ వీక్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా యూనివర్సిటీలో ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి, లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



తునిలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అధికారులు



యర్రవరంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తుని: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత అన్నారు. స్థానిక కొండవారిపేటలో సోమవారం పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ గర్భిణులు తక్కువ ఖర్చుతో లభించే సమతుల్య పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రశాంతంగా ఉండాలని, మంచి మాటలు వినాలని, మంచి ఆలోచనలు చేయాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం: చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూచించారు. మండలంలోని యర్రవరంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సుపోషిత భారత్ సాక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి స్థూలకాయం నివారణ, చక్కెర, నూనెల వినియోగంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది నాగమణి, అనంత, అమ్మాజీ, చంద్రావతి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పురుడు పోసుకోవాలి

ప్రత్తిపాడు: గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పురుడు పోసుకోవాలని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గీతా సుధ సూచించారు. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాసుధ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలని, వైద్య పరీక్షలు, స్క్రీనింగ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రసూతి నిపుణులు డాక్టర్ కృష్ణవేణి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల కొండలరావు (నాని), ఏపీ ఖాదీ బోర్డు మెంబర్ కొమ్ముల కన్నబాబు, గోపిశెట్టి శ్రీను, రావూరి తాతాజీ, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారి గీతాసుధ

గోతుల పూడ్చివేత

కిర్లంపూడి: మండలంలోని తామరాడ–రామచంద్రపురం రోడ్డు ఛిద్రమైంది. అడుగడుగునా గోతులు పడడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జనసేన జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తుమ్మలపల్లి రమేష్ స్పందించి తన సొంత నిధులతో సోమవారం గోతులను పూడ్చివేయించారు. గోతుల పూడ్చివేత పనులను ఆయన పర్యవేక్షించారు. రోడ్డు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.